సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ. 1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన

మహారాణిపేట: రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులవుతున్నా.. విద్యా కానుక విద్యార్థులకు అందలేదని, ప్రభుత్వం పంపించినా.. అధికారులు పంపిణీ చేయడం లేదన్నారు. విద్యార్థులందరికీ కిట్లు అందజేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని నాయకుడు వై.రాంబాబు కోరారు. రైతు భరోసా కేంద్రాల్లోని పోస్టులను తక్షణం భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి రాచపోలమాంబ మహోత్సవాలు

అల్లిపురం: అల్లిపురంతో పాటు 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం రాచపోలమాంబ అమ్మవారి మహోత్సవాలు మంగళవారం నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భూలోకమాత ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అమ్మవారిని సాయంత్రం సతకం పట్టు నుంచి గోకుల్ థియేటర్ దరి ప్రధాన ఆలయానికి సాముగరిడీలు, సంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ తిరువీధిగా తోడ్కొని వెళ్లనున్నట్లు వివరించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 20మంది ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొని టెస్ట్ రాస్తున్న అభ్యర్థులు, విద్యార్థులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎన్ఐఐటీ సంయుక్త ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 20 మంది అభ్యర్థులు అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి తెలిపారు. ఐసీఐసీఐ పర్మినెంట్ ఆన్‌రోల్ పోస్టు (రిలేషన్ షిప్ మేనేజర్)కు కళాశాల సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 60 మందికి పైగా విద్యార్థులు హాజరు కాగా, 20 మంది అర్హత సాధించారని క్యాంపస్ డ్రైవ్ హెచ్ఆర్ మేనేజర్ ప్రభాస్ తెలిపారు. అనంతరం కంపెనీ రూల్స్, జీతభత్యాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో–ఆర్డినేటర్ డి.అరుణపద్మ, జేకేసీ మెంటార్ వీఎస్ రాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు డైట్ పంపిణీ



సమ్మర్ క్యాంప్ క్రీడాకారులతో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: చిన్నారులు క్రీడల్లో రాణించాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఇందిరా ప్రియదర్శిని క్రికెట్ స్టేడియంలో క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు సోమవారం ఆయన డైట్ పంపిణీ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి చివరి శిక్షణ కావడంతో డైట్ పంపిణీ చేసి క్రీడాకారులతో మాట్లాడారు. సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణతో క్రీడా శిక్షణలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్‌లు పాల్గొన్నారు.

జగన్నాథుడి రథయాత్రకు వేళాయె..

- నేటి నుంచి 29 వరకు ఉత్సవాలు
- నేడు తొలి రథయాత్ర
- రేపటి నుంచి దశావతారాల్లో స్వామి దర్శనం



స్వామి రథాన్ని బయటకు తీసుకువస్తున్న భక్తులు



టర్నర్ చౌల్ట్రీలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

దాబాగార్డెన్స్: జగన్నాథుడి రథోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానుండటంతో దక్షిణ నియోజకవర్గంలో పది రోజుల పాటు ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. 185 ఏళ్ల ఘన చరిత్ర గల అతి పురాతన దేవాలయమైన టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంతో పాటు జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్ ఆధ్వర్యంలోనూ రథోత్సవాలు నిర్వహించనున్నారు. టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథుడి తొలి రథయాత్ర మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరోజు ఉదయం 7.35 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5 గంటలకు టౌన్ కొత్తరోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా టర్నర్ సత్రం వరకు వేదపారాయణం, గీతాపారాయణం, మేళ తాళాలతో వైభవంగా స్వామి తొలిరథయాత్ర నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్ నిర్వహించనున్న రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు బలభద్ర, సుభద్రా సమేత జగన్నాథస్వామిని రథంపై ఊరేగించనున్నారు.

ఇస్కాన్ సాగర్‌నగర్ ఆధ్వర్యంలో..

సాగర్‌నగర్ ఇస్కాన్ దేవాలయం నిర్వహించనున్న రథయాత్ర ఉత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు 4 రథాలతో రథయాత్ర సాగనుంది. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి దాబాగార్డెన్స్, ప్రకాశరావుపేట జంక్షన్, జగదాంబ జంక్షన్, వాల్తేర్ అప్‌రోడ్డు, సిరిపురం మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర కొనసాగనుంది. దారి పొడవునా బెంగాల్, ఒడిశా నుంచి వివిధ భజన మండళ్ల ఆధ్వర్యంలో భజనలు, నాదస్వరం, కీర్తనలు, కోలాటం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురజాడ కళాక్షేత్రానికి చేరుకున్న తర్వాత జగన్నాథ స్వామికి 501 రకాల ప్రత్యేక వంటకాలను నివేదించనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథ స్వామి ఆలయం నుంచి మంగళవారం సాయంత్రం 5 గంటలకు రథయాత్ర ప్రారంభమై టర్నర్ చౌల్ట్రీ వద్ద ముగియనుంది. 21 నుంచి 29వరకు స్వామి దశవతారాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్న దృష్ట్యా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశాం. భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశాం. వివిధ శాఖల నుంచి పలువురు సిబ్బందిని నియమించాం. రోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నాం. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఉత్సవాలకు సుమారు రూ.20 నుంచి రూ.25 లక్షలు వరకు అవుతుందని అంచనా.

– టి.రాజగోపాల్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి

సైకిల్‌పై జీవీఎంసీ కార్యాలయానికి కమిషనర్



సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం తిరిగి సైకిల్ పైనే బంగ్లాకు వెళ్లారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారానికి ఒక రోజైనా నగర ప్రజలు తమ సొంత వాహనాలు వదిలి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.

'జగనన్న ఆణిముత్యాలు'తో విద్యార్థులకు గుర్తింపు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి నగదు, ప్రశంసాపత్రం అందిస్తున్న డాక్టర్ రమాదేవి



మహాత్మా గాంధీ హైస్కూల్‌లో విద్యార్థులకు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న గోపీకృష్ణ

అల్లిపురం: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంతో విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. దాబాగార్డెన్స్ మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన టెన్త్‌లో 552 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన శ్వేతపాత్రోకు రూ.3 వేలు, 537 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన సన్యాసినాయుడుకు రూ.2 వేలు, 513 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన కె.నానికి రూ.1,000 చొప్పున నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులకు ప్రోత్సాహకంగా 1978 పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తరఫున ప్రతినిధి శ్రీనివాసరావు నగదు బహుమతి అందించారు. పార్టీ వార్డు మహిళా అధ్యక్షురాలు వై.చిన్నమ్ములు, బీసీ సెల్ అధ్యక్షుడు భీశెట్టి రాజు, పాఠశాల హెచ్ఎం ఆర్ వీఎస్ఎస్ నాగభూషణం పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు స్కాలర్‌షిప్..

రైల్వే క్వార్టర్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు డబ్బీరు సుగుణ అకాడమిక్ ఎక్సలెన్సీ స్కాలర్‌షిప్‌ను సోమవారం అందజేశారు. 545 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన గంటా శైలజ, 543 మార్కులతో రెండో స్థానంలో రోషిణి రాణి సాహు, 520 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన ఆర్.శ్రీజలకు రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలను డైట్ లెక్చరర్ డాక్టర్ రమామణి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ అమ్మగారు డబ్బీరు సుగుణ పేరు మీద స్కాలర్‌షిప్, అవార్డులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో లింగాల ప్రసాదరావు, డి.లక్ష్మి, డి.అరుణ,డి.జయచంద్ర, పాఠశాల హెచ్ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. రెవెన్యూకు 01, ఇంజినీరింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న మేయర్



తిరుమలలో మేయర్ హరివెంకట కుమారి దంపతులు

దాబాగార్డెన్స్: విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి దయతో జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వెంకన్న స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు ఆమె చెప్పారు.

ఘనంగా వేడుకలు: తిరుపతి నగర పాలక సంస్థ 11వ వార్డులో కార్పొరేటర్ శంకర్‌రెడ్డి నేతృత్వంలో కార్పొరేటర్లు తిరుమలరెడ్డి, మహేష్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, కార్యకర్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



వలంటీర్లతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. వెంకటేశ్వరమెట్ట–1 సచివాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు గొప్ప సేవకులని కొనియాడారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర విభాగాల్లో నగదు బహుమతి ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, రాష్ట్ర యువజన కార్యదర్శి వై.రమేష్, జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్ములు, ఆడారి వెంకట మహేష్, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, అయ్యప్పరెడ్డి, కొల్లి సత్యవతి, వేగి వెంకటప్పారావు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుకల పంపిణీ



విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: ఎంవీడీఎం స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు 39వ వార్డు కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు–నేడు, అమ్మ ఒడి, విద్య దీవెన మొదలగు పథకాలు ప్రవేశపెట్టడం ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పుడు తాజాగా జగనన్న ఆణిముత్యాలు పేరిట ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, అవార్డులు అందజేయడం గొప్ప విషయన్నారు. అనంతరం వార్డులో సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కార్పొరేటర్ సాధిక్ డైట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీడీఎం పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి 35వ వార్డు సమస్యలు



ఎమ్మెల్యే వాసుపల్లికి వినతిపత్రం ఇస్తున్న విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియం చుట్టూ దుకాణ సముదాయం నిర్మించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గాజులవీధిలో నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని, పూర్ణామార్కెట్ జంక్షన్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. వెలంపేట వద్ద ఉన్న లక్ష్మీనగర్ మురికివాడను అభివృద్ధి చేస్తూ పక్కా గృహాల నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కేకు తినిపిస్తున్న గొంప గోవిందరాజు

దాబాగార్డెన్స్: ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు కేక్ కట్‌చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాసరావు, బమ్మిడి గంగాధర్, గుత్తుల శ్రీనివాసరావు, నియాజ్, చంద్రశేఖర్, లక్ష్మి, కస్తూరి వెంకటరావు, భగత్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ



గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

జగదాంబ: టౌన్ కొత్తరోడ్డు సమీపంలోని రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు దరి శ్లాబ్ కూలిపోయిన సంఘటనలో గాయపడిన వారిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం కేజీహెచ్‌కు వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీ ఆర్టిస్టులకు హెల్త్‌కార్డుల పంపిణీ



సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న వంశీకృష్ణ

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సభ్యులకు హెల్త్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పలువురు సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, మురళీ, వర్మ, సురేష్, జేటీ రామారావు, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్‌లో నిర్మాణాలు ప్రారంభించాలి

మహారాణిపేట: ఆనందపురం మండలం సర్వే నంబర్ 50లో కేటాయించిన 150 ఎకరాల 77 సెంట్ల భూమి రాజన్న ఆటోనగర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించాలని సీఐటీయూ కార్యదర్శి కె.వి.పి. చంద్రమౌళి కోరారు. సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. స్మార్ట్ విశాఖ ఆటో పార్ట్స్ అండ్ స్క్రాప్ అసోసియేషన్‌కు కేటాయించిన 150 ఎకరాల స్థలంలో తక్షణం పనులు ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జగదాంబ జోన్ సంయుక్త కార్యదర్శి కె.గణేష్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

సీతమ్మధార: రాష్ట్రంలోనే అత్యంత ప్రధానమైన నగరంగా పేరొందిన విశాఖలో శాంతిభద్రతలు పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు కోరారు. ఇటీవల నగరంలో వెలుగు చూసిన కిడ్నాప్ ఉదాంతంపై సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల కాలంలో ఉషోదయ జంక్షన్ పరిసరాల్లో రెండు హత్యలు జరిగాయని, నగర వ్యాప్తంగా నిత్యం ఇటువంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటన నగరంలో శాంతిభద్రతల పరిస్థితిపై మరోసారి చర్చకు దారి తీసిందన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు ఎ.విమల, ఎస్‌కే రెహ్మాన్, ఆర్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, కె.సత్యాంజనేయ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసనతెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

సీతమ్మధార: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గ్యాస్ సిలిండర్, వంటపాత్రలతో సోమవారం నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకురాలు పి.మణి మాట్లాడుతూ ఆనందపురం, భీమిలి మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర నిర్వహిస్తోందని, ఆ సంస్థ ఉడకబెట్టిన గుడ్లు, అంబలి సరఫరా చేయడం లేదని తెలిపారు. కార్మికులే ఆ పని చేస్తున్నారని, ఒక గుడ్డు ఉడకబెట్టినందుకు గ్యాస్ నిమిత్తం పది పైసలు చెల్లిస్తోందన్నారు. అంబలికి ఏమీ చెల్లించడం లేదని, పాత్రలు ఇవ్వడం లేదని.. తమకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.మంగశ్రీ, డి.వరలక్ష్మి, కళాచందన తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

మద్దిలపాలెం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని యూనివర్సిటీ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్. ఎల్.విజయకృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ ప్రొగ్రామ్స్‌లో అడ్మిషన్ల కోసం www. braouonline. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

అల్లిపురం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా నూతన కమిటీ నియామకాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా 11వ మహాసభల్లో భాగంగా అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు కార్యక్రమంలో ఏడుగురు జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు 17మంది జిల్లా కౌన్సిల్ సభ్యులు నియమితులయ్యారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కె.అచ్యుతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా యు.రాగరాజు, రమణ, సహాయ కార్యదర్శులుగా ఎస్.మధురెడ్డి, కోమర సందీప్, కోశాధికారిగా శివలను నియమించినట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు తెలిపారు.

సికిల్ సెల్‌పై అవగాహన



రోగులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మి

మహారాణిపేట: మహారాణిపేటలోని ఇండియన్ రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం సికిల్ సెల్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు డాక్టర్ లక్ష్మి సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు, రోగుల ప్రవర్తన తదితర అంశాలపై వారికి సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి పి.రవికుమార్, సెక్రటరీ ఎం.డి.రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.